# టాంకుదళము

**భా**రతీయ సైన్యాలకు ముందుగానే వెళ్లుతున్నాయి వారిపొట్టి టాంకు దళాలు. ఈ టాంకులను మరుగుజ్జు టాంకులు అంటారు కూడాను. ఆ టాంకుల గర్భంలో నిండిఉన్నవారూ భారతీయ వీరులే.

ఆ ఇసుక మహాసముద్రంలో ఇసుక గుంటలు, ఇసుక కెరటాలు, వేడి వేడి గాలిదుమారాలు, ఎండమావులూ తప్ప ఏ అందమూ ముందు టాంకును నడుపుకుపోతున్న రావుకు కనబడుటలేదు.

టాంకు కన్నులలోంచే అతడూ చూస్తూ, టాంకును నడుపుకుపోయే యంత్రాలను సవరిస్తూ, చుక్కాని చక్రాన్ని తిప్పుకుంటూ ముందుకు తీక్షణంగా సాగిపోతున్నాడు.

గంటన్నర కిందట చిన్నచిన్న సంఘర్షణలో అతని రక్తము కెరటాల్లా పొంగిపోయింది. మహా క్రోధపూరిత మాగధ మహిషాన్ని నడిపే యముడులా తన టాంకును ఈ కందకంలోకి ఆ అడ్డతీగెల కట్టపైకి దుమికించాడు, ఎగిరించాడు, పరుగెత్తించాడు.

అతని కన్నులకప్పిన ఎర్రతెరలు అతని మెదడునిండిన జ్వాలాస్ఫులింగాలు టాంకు నరనరాలికి కమ్ముకుపోయి ఆ టాంకే ప్రాణపూరిత భయంకర పిశాచ మయింది.

టాంకులో ఉన్న తనతోటి భారత వీరులు క్షణక్షణమారణాగ్ని ప్రయోగశతాఘ్నికాల నుండి జర్మనులను చెండాడి వేటాడుతున్నారు.

ఆ టాంకుపై టాంకు విధ్వంసకాగ్ని గోళనిపాతము ఇంతైనా తగలదు. తగిలితే దూసుకుపోతుంది. ఛేదిస్తే చప్పబడి మూల ఒదిగి కూర్చుంటుంది.

## 2

**రా**వు యుద్ధంలో టాంకు నాయకుడుగా జేరకముందు సహజ శాంతశీలుడు, మితభాషి, త్రపాశీలి.

యుద్ధం అంటే చాలాభయపడ్డాడు. ప్రాణాలకే వెరిచాడు. రహస్యంగా స్నేహితులను యుద్ధంలో చేరవద్దని ప్రబోధించాడు.

ఇంతలో ఒకనాటి "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రికలో జర్మనులు ఒక రష్యను గ్రామంలో ఉన్న యావన్మంది స్త్రీ పురుషులను నాశనం చేశారు అని చదివాడు.

అతనికనులు మూతలుపడి, హృదయం వివశత్వం పొంది అతని మెదడురక్తం నిండింది.

స్టాలిన్ 'మీ యిళ్ళకూ, మీ బిడ్డలకూ, మీ భార్యలకు జరిగే విపత్తు ఆలోచించుకోండి. మీ దేశం మీది కాకపోతుందన్న భవిష్యత్తు ఆలోచించండి" అని రష్యన్ల ప్రబోధించడం చదివాడు.

ఏమిపుట్టిందో తల్లికి చెప్పకుండా – సైన్యాధికారోద్యోగానికి దరఖాస్తు పెట్టినాడు. రాజముద్రాంకితోద్యోగము కొన్ని మాసాలలో వచ్చింది.

మహా యుద్ధానికి శిక్షణ ఇచ్చినవారిలో ముందువాడయ్యాడు. టాంకు నడుపుట, టాంకుయుద్ధము చేయుట, శతఘ్నుల నవలీలగా పేల్చుటలో అద్వితీయుడయ్యాడు.

ధీర లలితుడు, ధీరోధాత్తు డయ్యాడు.

## 3

**లి**బియా ఎడారిలో భారతీయ సైన్యాలు అవిరళ పురోగమన వేగవంతాలై బ్రిటీష సైన్యాలతోపాటు చొచ్చుకుపోతున్నవి.

రోమెలు సేనాని జర్మను దళాలను అనేక వ్యూహాలతో అనేక బంధాలతో రక్షించుకొంటూ నిలువనీడలేక వెనక్కు పరుగెత్తుకుని, పోతూ పోతూ ఏల్ అఘెలియా ప్రదేశంలో మోహరించాడు.

మూడురోజు లక్కడ ప్రచండ యుద్ధం జరిగింది. శతఘ్నులపొగలు, ఇసుక పొగలు దిఙ్మండలం అంతా కప్పాయి. ఎక్కడ చూచినా కుప్పలుగా ఇనుపముళ్ళతీగలు అడ్డాలు, టాంకు విధ్వంసక గర్తరాలు. అడ్డాల కత్తెర బంధాలు.

రావు టాంకు ఎట్లు దాటిందో ఇవన్నీ, జర్మను వ్యూహ మధ్యానానికి వెళ్ళేటప్పటికి ఒక్క జర్మనులేడు. జర్మనులు ఇంకా తిరోగమన ప్రదర్శనము నాటక మాడినారు.

## 4

**ఏ**ల్ అఘెలీ విజయయాత్ర సాగుతోనే రావు టాంకులో చక్రం మీదకు వాలిపోయాడు.

ఇన్నాళ్ళనుంచీ చెక్కు చెదరని అతనిప్రేమ నిధానమైన చిట్టి టాంకు దెబ్బతిన్నది. దూరాన్నుంచి ఒక జర్మను గుండు వచ్చి పేలి, రావు టాంకుకు పార్శ్వంలో తాకి, చొచ్చి రావుకు కంఠం క్రిందతగిలి అతణ్ణి మూర్ఛగతుణ్ణి చేసింది.

ప్రక్కనున్న సహాయ చోదకుడు రావును నెమ్మదిగా తప్పించి తానా చక్రాన్ని ధరించాడు.

దెబ్బతిన్న రావుచేతులు ఆ మైమరుపులో ఏదో తిప్పుతూనే ఉన్నాయి.

తన టాంకునకు రావు "మహిషమర్దని" అని పేరు పెట్టుకొన్నాడు. మహిషమర్దని ఆగింది. రావును తాత్కాలిక వైద్య శిబిరానికి తీసుకు వెడుతుంటే ఆమె కన్నుల నీరు వచ్చినట్లు ఆమె గర్భంనుంచి వచ్చిన ఇతర భారతీయ యోధులకు కనిపించింది.

వైద్యనాయకుడు పరీక్షచేశాడు. కంఠంలోనుంచి వెళ్ళిన అక్షాగ్ని మయశకలము శుభ్రంగా ఆవలికి పోయింది. ఒకటి రెండు చిన్న రక్తనాళాలు తెగినవి. రావు వారం రోజులలో మళ్ళీ యుద్ధానికి సిద్ధం అని అన్నాడు.

## 5

**రా**వుకు ఆపరేషన్ జరిగిన వెనుక స్వప్నలోకంలో విహరించే మత్తు తనంలో, వైద్యోపచారికైన ఒక ఫ్రెంచి బాలిక అతడు ప్రేమతో "మహిషమర్ధనీ" అని పిలుచుట విన్నది.

ఆమె ఆశ్చర్యమందింది. ఎవరాబాలిక అని ఆమె ప్రశ్నించుకొన్నది.

రావుకు మెలకువ వచ్చింది. "నీనా" అన్న ఆ బాలిక రావుని మహిషమర్ధని పేరు తలపుకు తెస్తూ హాస్యం చేసింది.

"ఎవరయ్యా ఆ బాలిక? నీ ప్రియురాలా!"

"అవును. ఆమె కులాసాగా ఉన్నదో, లేదో నా మిత్రు లొకరూ చెప్పేరు కారు!"

"ఏమీ ఉత్తరాలు రాలేదయ్యా?"

"ఉత్తరా లక్కరలేదు. మా స్నేహితులకు తెలుస్తుంది. నువ్వు ఆలోచిస్తావేమి?"

"ఏమీలేదులే. నీ పేరు ఇంగ్లండుకు పొగడుతూ పంపారటలే!"

"అయితే నీ అందమైన ముఖంలో చిన్న అలలులాంటి ఆ ముడుతలు ఎందుకు?"

"మహిషమర్ధని అంటే అర్థం ఏమిటి?"

"మహిషమర్ధని అంటే, దున్నపోతుల చంపే తల్లి అని"

"నీ ప్రియురాలికి అంత భయంకరం పేరు ఎందుకూ?"

"అంత గొడవ ఎందుకులే, మీ ఊరు ఏది?"

"టునీషియా"

"నీ పేరు?"

"నీనా"

"ఎంత అందంగా ఉంది నీ పేరు కూడా!"

"నీ ప్రియురాలికన్నా ఎక్కువ అందంగా ఉన్నానా?"

"నా ప్రియురాలు ఎవరని నీ ఉద్దేశం? అది నా టాంకు."

"టాంకు!"

"అవును."

ఆ బాలిక పకపక నవ్వింది. ఆమె వదనము ఆనందకాంతితో ప్రఫుల్లమైంది.

"నేను నిజంగా భయపడ్డాను రావ్" అని ఆమె అన్నది.

అతనికంతా అవగతమైంది. అతడు నవ్వుకొన్నాడు! ఆ శిబిర మంచముమీద పడుకొనియే ఆమె రెండుచేతులూ పట్టుకొని తన హృదయానికదుముకొనినాడు!

బయట వైద్యము చేయబడుతున్న మహిషమర్ధని నిశ్శబ్ద గర్జనచేసి, సంతోషముతో నవ్వుకొన్నది. ●